# దత్తపుత్రుడు

కొడవటిగంటి కుటుంబరావు



అయిదేళ్ళవాడప్పుడు ప్రసాదరావును తెచ్చి పెంచుకున్నది సుబ్బమ్మగారు. వాడికి లక్ష్మీనారాయణశాస్త్రి అని తన భర్తగారి పేరే పెట్టించుకుని, ఆ పేరుపెట్టి పిలిచే యోగ్యత తనకు లేదు గనక 'ప్రసాదం' అని పిలిచేది.

తన దత్తత నిశ్చయమైన కొత్తలో ప్రసాదం (లేక, శాస్త్రి) తనకేదో జరగబోతున్నదని మాత్రమే తెలుసుకోగలిగాడు గాని అది ఏమిటో గ్రహించలేక పోయినాడు. తనకు నిజంగా ఏదైనా విపత్తే జరగబోతుంటే ఎవరో ఒకరు తనకోసం ఆదుర్దాపడరా? ఏ విపత్తూ లేకపోతే, తన తల్లి మొహంముడుచుకొని సహం కావటానికి కారణం ఏమిటి?....ఆ రాత్రి ఒక రాత్రివేళ ఆవిడ తన పక్కలోవచ్చి ఎందుకు పడుకున్నది? తన మొహం ఎందుకు అన్నిసార్లు ముద్దుపెట్టుకొన్నది? ఆవిడమొహం తన మొహానికి తడిగా ఎందుకు తగిలింది?

తన తల్లి చేసిన ఆ పనికి ఆ అర్భకుడికి ఆనందంకలిగే అవకాశంకూడా ఎక్కడ? ఒకవేపునించి అర్థంకాని భయం ఆవరించుకొచ్చిందేగాని!

ఆ తరవాత, వెంటనే కొద్దిరోజుల్లో దత్తత చేసేశారు. తనకు కొత్త తల్లి వచ్చింది. ఆవిడకు జుట్టులేదు. బొట్టులేదు. ఇకముందు ఆవిడ తనకు అమ్మ! వెధవ ముండ అయిన అమ్మను ప్రసాదం ఊహించుకోలేక పోయినాడు. వాడి కది చెప్పరానంత అశుభంగా తోచింది.

దత్తత జరుగుతుంటే, వాడు ఎవరికేసీ చూడలేక పోయినాడు. అవమానమూ, రోషమూ, దుఃఖమూ, నిరాశా, ఇంకేమేమిటో వాడి చిన్న హృదయాన్ని మథించేస్తున్నై. వాడి కళ్ళు మంత్రాలు చదివే బ్రాహ్మణ్ణిగురించి అతంగా అసహ్యమైన విషయాలన్నీ గమనిస్తున్నై. ఆయన పెదిమలు ఎట్లా కదిలేవి, ఆయన మెడమీది చర్మమూ పీకా ఎట్లా పైకీ కిందికీ ఆడుతున్నవి మంత్రాలు చదవటంలో గుక్క తీసుకునేటప్పుడు ఆయన కనుబొమ్మలు ఏ విధంగా పైకెత్తేదీ గమనిస్తున్నాడు. తనవెనక, సమీపంలోనే కూర్చున్న తన అమ్మ—ఆ వెధవముండ గుండు ముసుగు కాదు!—"అమ్మ" మొహం ఎట్లాఉన్నదీ, చూడకుండానే వాడికి కనిపిస్తున్నది.

దత్తత అయిపోగానే "అమ్మ" కంటపీరు పెట్టుకున్నది. తనకూడా బావురుమని ఏడుపొచ్చింది. ప్రసాదం ఏడిచాడు.

"పిల్లవాణ్ణి కాస్సేపు అట్లా దొడ్లోకి తీసుకుపోయి సముదాయించవమ్మా!" అని ఒక మగగొంతు—నలభై ఏళ్ళ నెరసిన గడ్డం గొంతు—కేకపెట్టింది.

'నాన్నగదూ! ఏడవకు. అట్లా ఏడుస్తారా ఎక్కడన్నా?' అన్నది అమ్మ.

'మరి నువ్వేడవలేదూటే?' అన్నాడు ప్రసాదం.

"మిగిలిన నలుగురు పిల్లలులేందీ, నువ్వు నన్ను 'ఏమే' అని పిలవటంకూడా ఎందుకు నేర్చుకున్నావురా నాన్నా? నీ మాటలు జ్ఞాపకంవస్తే నే నేమయేదిరా?" అని ఆవిడ మళ్ళీ రోదనం మొదలు పెట్టింది. ప్రసాదానికీ ఏడుపొచ్చింది.

ఇంతలో ముంచుకుపోయినట్టుగా వచ్చింది ఆ ముసుగు గుండు వెధవ ముండ—"పిల్లవాడేడుస్తున్నాడుటమ్మా! పాపం .." అంటూ.

దూరాన్నించి ఒక గర్జన వినబడింది—"వ్వాసే, సుబ్బ . .మ్మా" గడ్డం నెరిసిన నలభైఏళ్ళ గొంతు.

"ఓ ఓ ఓయ్!" అన్నది ముసుగు వెధవముండ గుండు.

"నే వచ్చా రా!" — నెరసిన పీఛాని నలభైఏళ్ళ రుద్రాక్షలు బలసంతాన గుండు రుద్రాక్షల మాటప్రకారం నడుచుకుంటూ వెళ్ళింది.

"అమ్మా, నాకు వాళ్ళ ఆస్తి ఒద్దే!" అన్నాడు ప్రసాదం ఏడుపు గొంతుతో. తల్లి సమాధానంకోసం ఊపిరి బిగబట్టి చెవులురిక్కించిన దేవతలకేమీ వినిపించ లేదు.

* *

"అబ్బాయి, ప్రసాదం!....ఇక్కడ వుండే పలకవేంరా నాయనా?"

"ఎందుకేం?"

"అన్నం తినవుట్రా?"

"నా కాకల్లేదు పో!"

"నన్నెందుకురా, నాయనా, ఇట్లా ఏడి పిస్తావ్?"

"నువ్వు మా అమ్మ నేడిపించలేదేం? ఆవిడకన్న నువ్వెక్కువేం చేస్తున్నావా?"

"హయ్యో తండ్రీ! ఏడవదూ, పాపం! కన్నకడుపు కాదూ? విన్నెప్పుడు పెంపు డివ్వటానికి వొప్పుకుందో అప్పుడే ఆవిడ కడుపు కోసుకుంది."

"నువ్వు పెంపుడడిగితే ఇచ్చింది. లేక పోతే ఇస్తుందా ఏమిటి?"

"అడిగితే మాత్రం ఇస్తార్రా నాయనా! ఇంకా ఇద్దరు కొడుకులూ, ఓ కూతురూ ఉన్నారు గనుక ఇచ్చింది. లేక పోతే ఇస్తుందా?"

"మరి నాకోసం ఏడవటం మానే సిందా?"

"మానకుండావుందా ఏమిటి? ఏడిచి ఏడిచి మానేసుంటుంది."

"మా అమ్మ నాకోసం రోజూ ఏడు స్తుంది"

"నేనుమాత్రం మీ అమ్మను కాదుట్రా నాయనా!"

"నువ్వు మా అమ్మ వెందు కవుతా వేమిటి? మా అమ్మను నేను 'ఏమే' అనే వాణ్ణి. అందుకని నాకోసం ఏడుస్తుంది."

"నన్నుకూడా 'ఏమే' అనరా!"

"మా అమ్మ నా దగ్గర పడుకుని ముద్దు పెట్టుకునేది."

"మరి, నే ముద్దుపెట్టుకోబోతే తోసేస్తా వెందుకురా నాయనా?"

"నువ్వా! నీ దగ్గర వెధవముండ వాసన! నువ్వేమన్నా మా అమ్మవా ఏమిటి, నన్ను ముద్దుపెట్టుకోటానికి."

"నేను మీ అమ్మల్లే ఏడవటంలా? చూడూ!"

"అన్నీ దొంగ ఏడుపులు!....నాతో అవీ ఇవీ చెప్పుతూ కూచ్చుని అన్నం పెట్టవేం?"

"ఇదుగో ఒక్క క్షణం!"

"నాకు పెరుగ్గావాలి, ఉందా?"

"అయ్యో! నీకు పెరుగులేకుండా చేస్తానుట్రా?"

"నిన్ను 'అమ్మా' అని పిలవటానికి లంచమేం?"

"నీ కిష్టంలేకపోతే పిలవకమ్మా! 'అమ్మా' అని పిలువకపోయినా పెరు

గేస్తాగా! నీకు కాకుండా నే నింకెవరికి పెట్టుకుంటాను చెప్పు."

"మా అమ్మను చూడాలి మా అమ్మ దగ్గిర పడుకోవాలి, మా అమ్మ నన్ను ముద్దుపెట్టుకోవాలి, నా కన్నం పెట్టాలి, మా అమ్మ నాకు నీళ్లు పొయ్యాలి, మా అమ్మను రమ్మను, లేకపోతే నేను బడికి పోను, అన్నం తినను, నీళ్లు పోసుకోను, ఏమీ చెయ్యను.'

"మీ అమ్మ, పాపం, ఇక్కడికివచ్చి కూచోమంటే కూచోగలదా? నువ్వే వెళ దువుగాని,"

"అన్నీ చాట్టిదే! నువు పంపిస్తావా నిజంగా?"

"పంపించకపోతే అప్పుడను "

"చూద్దాంగా!"

తనతల్లి కనపడగానే ప్రసాదం తల్లి కేసి చేతులుచాచి "నే నొచ్చానే అమ్మా!" అన్నాడు. తల్లి పెద్దకేకవేసి కొడుకుని ఆలింగనంచేసి, మొహమంతా నిమిరి, "ఒచ్చావుట్రా, నాన్నా? నా చిట్టితండ్రే! నా బంగారుతండ్రే! మా నాయనే! మా వరహాలే!" అని ప్రేమ కురిపించ సాగింది.

"నన్ను పంపించకపోతే అన్నం తిన్నన్నానే! బడికి పోనన్నానే! నీళ్ళు పోసుకోనన్నానే!"

తల్లి [illegible]మీద వేలుపెట్టుకొని గుడ్లు తేలవేసి కొడుక్కేసి చూస్తూ "అయ్యయ్యో! అట్లా అనొచ్చున్రా, పిచ్చివెధవా!" అన్నది.

"ఏమే!" అన్నాడు ప్రసాదం, నిర్లక్ష్యంగా తల ఆడిపిస్తూ.

"ఆవిడ ఏమన్నా అనుకోదూ?"

"ఏ మనుకుంటే!" ఇంకా నిర్లక్ష్యంగా.

"ఆవిడ క్కోపం రాదుట్రా? పైకట్లా అనొచ్చా?"

"ఆ వెధవముండ క్కోపం వస్తే నాకు భయమా ఏమిటి? అన్నాడు తన తల్లి బెదురు కాశ్చర్యపడుతూ.

తన కొడుకు ప్రయోజకత్వానికి కలిగిన ఆనందాన్ని లోపలే అణుచుకోటానికి ఆవిడ చెయ్యగలిగినంత ప్రయత్నం చేస్తూ, నోటిమీద చెయ్యి కొట్టుకుంటూ "అవ్వ! అవ్వ! అట్లా అనొచ్చుట్రా? ఆవిడకు తెలిస్తే ఏమంటుందీ" అన్నది.

"ఏమంటుందేం? నేను రోజూ ఆవిణ్ని అంటంలా?"

"ఏమనీ?"


"వెధవముండా అనీ"

తల్లి కొడుకువంక సోద్వేగంగా చూస్తూ "అనూటంటే ఊరుకుంటుందీ?" అన్నది.

"ఎందు కూరుకోదూ?"

"నువ్వట్లా అన్నా, నిన్ను ఆపేక్షగా చూస్తుందిట్రా?" అన్నది తల్లి.

"పెరుగేసి పెడుతుంది."




రాత్రివేళ భోంచేసి ప్రసాదం పడుకున్నాడు. ఇక్కడి మంచాలూ పక్కలూ అక్కడంత బాగాలేవు. లేకపోతే ఏం? ఇది అమ్మవేసిన పక్క. ఇవాళ మళ్ళీ ఒకరాత్రివేళ అమ్మవచ్చి తనపక్కలో పడుకుని అదివరకల్లేనే ముద్దు పెట్టుకుంటుంది. కాని ఏడవదు. ఇంకెందు కేడవడం? తన పెంపుడయి పోయిందిగా!

అమ్మవచ్చి తనదగ్గర పడుకునేదాకా తను మేలుకునే ఉండాలి. కనుపించిన సంతోషం పొద్దున అమ్మ ఎంతోబాగా కనపరిచింది. మళ్లా రోజల్లా కనబరచలేదు. కాని, లోపల ఉంటుంది!

అమ్మా, నాన్నా జాముసేపటినించి మాట్లాడుకుంటున్నారు. తనకేమీ అర్థం కాదు. వాళ్లు మాట్లాడేది తన్నుగురించే.

"ఆవిడకి వాడంటే చాలా ఆపేక్షగా ఉన్నట్టుంది. అదీ కొంతనయమే। వాణ్ణి మనిష్టం వచ్చినప్పుడల్లా తెచ్చుకోవచ్చు ఆవిణ్ణి కొంత డబ్బేమయినా అడుగుతారా ఏమిటి?'' అంటున్నది అమ్మ.

"ఏదో చూద్దాంలే.'' అని విసుక్కుంటున్నాడు నాన్న.

* *

నెలరోజులయినా సుబ్బమ్మ కుర్రవాడి కోసం కబురు చేయదు. పది రోజులనించీ ప్రసాదం తల్లిదండ్రుల ఆదుర్దా హెచ్చుతున్నది.

ఆవిడ పిల్లాణ్ణి విడిచిపెట్టేసి, ఇంకోణ్ణి పెంచకుంటుందేమో।

వీడు ఆవిడకేం కోపం తెప్పించాడో ఏం ఖర్మమో!

కాకపోయినా, ఆవిడమీద ఈ వెధవ కింత అలుసెట్లా వచ్చిందో? ఎవర్నీ తొందరపడి ఏమాటా అనేవాడు కాడే!....

చాటుగాఅమ్మ అబ్బాయిని కపిరింది—

"నువ్వావిణ్ణి ఏమన్నావురా వెధవా?"

"వెధవముండా" అన్నాను.

"ఎన్నిసార్లన్నావు?"

"ఏమో! చాలాసార్లన్నాను. ప్రతి రోజూ అన్నాను. ఆవిడ వెధవ ముండ కాదా ఏమిటి? ఆవిడ దగ్గిర వెధవముండ వాసనకూడానూ!"

తనని గద్దించే తల్లినీ, అదివరకు ఆ వాడు తనని దొడ్లోకి తీసుకువచ్చి ఏడ్చిన తల్లిని ఒకతెగా భావించలేక పోయినాడు ప్రసాదం. ఆడదాని అఘాయిత్యం వాడి కేం తెలుసు! ఆనాడు తనని ఏడిపించడమే ఆవిడ ఆశయం అని వాడేమెరుగునూ?

"మా వాడు పట్టి పదరుటోతు. వాడు అందర్నీ తిట్టటం కూడా నేర్చుకున్నాడు." అన్నాడు అబ్బాయి జనకతండ్రి.

"అందర్నీ ఎందుకు తిడతాడు పాపం? నన్నే తిడతాడు. వాడిచేత తిట్టించుకోవటం నాకు ముద్దే! నేను వాడి కా అలుసిచ్చాను." అన్నది సుబ్బమ్మగారు.

జనకతండ్రి అతిదీర్ఘ నిశ్వాసం విడిచాడు. అంతగారి ఆయనతో ఉండి రకరకాల హృదయమనోవికారాలు కలిగిస్తూ ఉండింది. ఆ విషవాయువు బయటికి పోగానే ఆయన మొహంలో కొత్తకళ వచ్చింది.

"వాడు తల్లికోసం, పాపం, కలవరించసాగాడు. అందుకని పంపించాను. వాడిసుఖమే నాక్కావలిసింది." అన్నది సుబ్బమ్మకూడా నిట్టూర్చి.

"బాగుందే! ఇక మీరే వాడితల్లి! మీరువాణ్ణి కాస్త భయపెట్టండి. లేకపోతే చెడతాడు!"

"ప్రసాదం?"

"ఏవమ్మా?"

"పడుకోవట్టూ, నాయనా?"

"పడుకుంటాన్లేవే!"

"నాపెచ్చితండ్రిగడే నన్నేవే అన్నావుటే! ఏదీ ఒకముద్దుపెట్టు! ఆరిదొంగముండా, నీముద్దెంత కమ్మగా ఉందిరా! ... నా దగ్గిర వెధవముండ వాసనెయ్యటం లేదమ్మా!"

ప్రసాదం ఒక్క మొహం వేశాడు.

"నాతండ్రి వెదువేరా!" అని సుబ్బమ్మ కుర్రాణ్ణి తనరొమ్మున అదుముకున్నది.

